సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 2 । జూలై । 2024



విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



నేడు స్వర్ణ పుష్పార్చన

డాబాగార్డెన్స్(విశాఖ): కనకమహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.



జీపు బోల్తా

ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ సమీపంలో ప్రైవేట్ జీపు బోల్తా పడి, 15 మంది గాయపడ్డారు. 8లో

న్యూస్‌రీల్

ఆరు టేకు దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలు

సాక్షి ఎఫెక్ట్..

కొయ్యూరు: 'స్మగ్లర్లతో మిలాఖత్' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై అటవీ అధికారులు స్పందించి, నిఘా పటిష్టం చేశారు. సోలాబు టేకు ప్లాంటేషన్ సమీపంలో నరికి ఉంచిన ఆరు టేకు దుంగలను ఎస్‌ఎస్‌వో నూకరాజు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. వాటిని కాకరపాడు కలప డిపోకు తరలించారు. వీటి విలువ రూ.26,400 ఉంటుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌వో మాట్లాడుతూ ఎవరు అక్రమంగా కలప తరలించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఏడుగురు బాలికలు



బాలికలను అభినందిస్తున్న ఎస్‌వో పరిమళ

కొయ్యూరు: జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు కొయ్యూరు కేజీబీవీలో చదువుతున్న ఏడుగురు బాలికలు సోమవారం బయలుదేరారు. ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని ఉద్దమ్‌సింగ్ నగర్‌లో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం చదువుతన్న కె.లావణ్య, కె.కేసియ, కె.తబిత, బి.భార్గవి, కె.నిర్మల, కె.రాణి, మరో బాలిక బయలుదేరారు.వారికి ఎస్‌వో పరిమళ, కోచ్ నూకరాజు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.


శతశాతం హాజరు తప్పనిసరి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు

చింతపల్లిరూరల్: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శతశాతం తప్పనిసరిగా ఉండాలని, ఆ మేరకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షమ శాఖ డీడీ కొండలరావు అన్నారు. స్థానిక సీఏహెచ్ పాఠశాలలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల హెచ్‌ఎంలు, ఏటీడబ్ల్యూవోలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఇతర పాఠశాలల్లో అధికంగా ఉన్న ఉపాధ్యాయులను ఇన్‌చార్జ్‌లుగా నియమించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మెనూ తప్పక పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జిప్‌లైన్'పై విచారణ చేయాలి



డానియేలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహల వద్ద అనుమతి లేకుండా జిప్‌లైన్ నిర్వహించడంపై విచారణ చేపట్టాలని పీసా కమిటీ అధ్యక్షుడు డానియేలు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీసా కమిటీ తీర్మానం లేకుండా జిప్‌లైన్ ఏర్పాటు చేసి, ట్రయిల్ రన్ పేరుతో 9నెలల నడిపిన నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలోని గిరిజనుల చట్టాలను తుంగలో తొక్కడంపై ఆయన మండిపడ్డారు. పర్యాటకశాఖ ముసుగులో ప్రైవేటు వ్యక్తి జిప్‌లైన్ నడపడం దారుణమని, పీసా అనుమతులు ఇవ్వకపోయినా ఇష్టారాజ్యంగా నిర్వహించారని తెలిపారు. గతంలోని దీనిపై ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకరరావు దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి, తగు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారని చెప్పారు.

విద్యుత్ ఉత్పత్తికి నీటి గండం

- జూన్ పూర్తయినా నిండని రిజర్వాయర్లు
- గత ఏడాదితో పోలిస్తే తక్కువగా నీటిమట్టాలు
- నీటి కొరతతో 22 మెగావాట్లకు పడిపోయిన విద్యుత్ ఉత్పాదన
- ఈ ఏడాది పూర్తిగా అడుగంటిన మత్స్యగెడ్డ
- మాచ్‌ఖండ్‌లో రానున్న రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి ప్రశ్నార్థకం



ఎండిపోయిన మత్స్యగెడ్డ




నీటి నిల్వ తక్కువగా ఉన్న జోలాపుట్టు జలాశయం

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన జోలాపుట్టు జలాశయంలో జూన్ నెల ముగిసినా జలకళ కరువైంది. ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో నీటి కొరత వల్ల మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి ఇబ్బందికరంగా మారింది. విద్యుత్ ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం ఉన్నా తగినంత నీరు లేకపోవడం ఎప్పుడు విద్యుత్ ఉత్పాదన నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జోలాపుట్టులో ఉన్న ప్రధాన,స్పిల్‌వే జలాశయాల్లో పూర్తి స్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా, ఆదివారం జోలాపుట్టు ప్రధాన జలాశయంలో 2,698.75 అడుగుల నీటి మట్టం నమోదు అయింది. ఇదే రోజు గత ఏడాది 2,700.05 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే రెండు అడుగుల తక్కువగా నీటి నిల్వ ఉంది. జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం పూర్తిగా అడుగంటి దర్శనమిస్తోంది. గత ఏడాది స్పిల్‌వే జలాశయంలో 2,689 అడుగుల నీరు ఉండేది. ఈ ఏడాది అదికూడా లేకపోవడం గమనార్హం. ఈ రెండు జలాశయాల నీటి మట్టంపై ఆధారపడి ఉన్న డుడుమ జలాశయంలో సైతం నీటి మట్టం ఆశించిన స్థాయిలో లేదు.డుడుమ జలాశయ నీటి మట్టం 2,590 అడుగులు కాగా, ప్రస్తుతం 2,581.20 అడుగులు ఉంది. డుడుమ జలాశయంలో నీరు తగ్గకుండా చూసేందుకు కొన్ని రోజులుగా జోలాపుట్టు జలాశయం నుంచి ఒక గేటు ఎత్తి 400 క్యూసెక్‌ల నీటిని విడుదల చేస్తున్నారు. రెండు,మూడు వారాల్లో వర్షాలు కురవకపోతే జోలాపుట్టు స్పిల్‌వే పూర్తిగా అడుగంటే ప్రమాదముంది. ప్రధాన జలాశయంలో సైతం నీరు లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఆరు జనరేటర్ల సాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగే సామర్థ్యం మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి ఉంది. అయితే నీటి సమస్య కారణంగా ఒక జనరేటర్‌తో 21 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. జలాశయాల్లో నీటి మట్టం పెరగకపోతే విద్యుత్ ఉత్పాదనకు ఆటంకం కలుగుతుంది. ఎప్పుడు భారీ వర్షాలు కురుస్తాయే... జలాశయాలు నిండుతాయే అని ఆంధ్ర–ఒడిశా జెన్‌కో అధికారులు ఎదురుచూస్తున్నారు.

అడుగంటిన మత్స్యగెడ్డ

జోలాపుట్టు,డుడుమ జలాశయాల నీటి నిల్వలు ప్రధానంగా మత్స్యగెడ్డలో నీటి నిల్వపైనే ఆధారపడి ఉంటాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మత్స్యగెడ్డ పూర్తిగా ఎండిపోయి దర్శనమిస్తోంది. మత్స్యగెడ్డ గిరిజన ప్రాంతంలోని ఎనిమిది మండలాల్లో కురిసే వర్షంపై ఆధారపడి ఉంటుంది. జి.మాడుగుల మొదలు పాడేరు,హుకుంపేట,డుంబ్రిగుడ, అనంతగిరి,పెదబయలు,ముంచంగిపుట్టు మండలాల్లో గత కొన్ని రోజులుగా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో మత్స్యగెడ్డలోకి నీరు చేరలేదు.ఆయా మండలాల్లో వర్షాలు అధికంగా కురిస్తే మత్స్యగెడ్డలోకి వరదనీరు వచ్చి నీటి నిల్వ పెరిగి జోలాపుట్టు జలాశయంలోకి నీరు చేరుతుంది. అక్కడ నుంచి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి అవసరమైన నీరు సరఫరా చేయడం జరుగుతుంది. జూలై నెల అంతా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడితే తప్ప పూర్తిగా మత్స్యగెడ్డలో నీరు చేరే అవకాశం లేదు.



మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం

మోదమ్మ ఆలయ చైర్మన్‌గా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



విశ్వేశ్వరరాజును దుశ్శాలువాతో సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఈశ్వరి

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తన పుట్టిన రోజు సందర్భంగా ఆయన మోదమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల భక్తులతో సమావేశం నిర్వహించి, ఆలయ కమిటీ ఏర్పాటుపై చర్చించారు.ఇంతవరకు ఆలయ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. విశ్వేశ్వరరాజును మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,గిడ్డి ఈశ్వరి,పలు పార్టీల రాజకీయ నాయకులు,గిరిజన,ఉద్యోగ,ఉపాధ్యాయులు,వర్తక సంఘం నేతలు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.అనంతరం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కిల్లు కోటిబాబు నాయుడు పేరును ఆలయ కమిటీ చైర్మన్ విశ్వేశ్వరరాజు ప్రకటించారు.మిగిలిన కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

రాజవొమ్మంగిలో భారీ వర్షం



రోడ్‌పై ప్రవహిస్తున్న వట్టిగెడ్డ వాగు

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. వాగులు పొంగి ప్రవహించాయి. ప్రధాన రహదారి నుంచి ఎర్రంపాడు, గింజర్తి గ్రామాలకు వెళ్లే మార్గంలో వట్టిగెడ్డ వాగు పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాజవొమ్మంగి నుంచి అమ్మిరేఖల, లాగరాయి గ్రామాలకు వెళ్లే మార్గాల్లో కొండవాగులు ప్రవహించడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొండలపై కురిసిన వర్షం నీరు మండలంలోని అప్పలరాజుపేట వద్ద గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరింది. మూడునాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 10 అడుగులకు నీటి మట్టం పెరగడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ రిజర్వాయర్ ద్వారా ఐదు గ్రామాలకు చెందిన సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

పింఛన్ల పంపిణీ 90.16 శాతం పూర్తి



సుండ్రుపుట్టు కాలనీలో పింఛన్ నగదు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో మొదటి రోజు సోమవారం 90.16 శాతం మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పింఛన్లు అందజేయగా, కొన్ని చోట్ల సెల్ సంకేతాలు అందడం లేదన్న పేరుతో గ్రామంలో అందరినీ ఒకే చోటకు రప్పించి పంపిణీ చేశారు. పెరిగిన పింఛన్ సొమ్ము రూ.4వేలతో పాట గత మూడునెలల బకాయి పేరుతో అదనంగా మరో రూ.3వేల మొత్తం రూ.7వేలను సామాజిక పింఛన్‌దారులకు సచివాలయాల ఉద్యోగులు పంపిణీ చేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్ పాడేరు పట్టణ పరిధిలోని సుండ్రుపుట్టు కాలనీని సందర్శించి పింఛన్ల పంపిణీని పరిశీలించి, పలువురు లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఎంపీడీవో సాయి నవీన్,ఈవోపీఆర్‌డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలి నెలలోనే 'కోత' మొదలైంది..!

2014లో అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరిట.. ఉన్న పెన్షన్లకు టీడీపీ ప్రభుత్వం ఎలా కోత విధించిందో.. ఈసారీ సీన్ రిపీట్ చేసింది.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 22 మండలాల పరిధిలో 1,27,064 మంది పింఛన్‌దారులండేవారు.కానీ.. ఈ నెలకు వచ్చేసరికి 1,26,813 మంది మాత్రమే పింఛనుదారులున్నట్లు ప్రభుత్వం విడుదల చేసింది. అంటే.. అధికారంలోకి వచ్చిన వెంటనే 251 మంది పింఛన్లకు కోత విధించినట్లు తెలుస్తోంది. పింఛన్‌దారులు తగ్గడంపై అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 10 ఏళ్ల జైలు

విశాఖ లీగల్: యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తికి పదిఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ విశాఖ నగరంలోని షెడ్యూల్ కులాలు తెగల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పి.సత్యదేవి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితులందరికీ జరిమానా విధించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

నిందితులు సుకారాపు గిరీష్ (37), అతని భార్య ఎస్.విజయ జ్యోతి, రేగాడ తలుపులమ్మ, సుర్ల కొండమ్మ ఉమ్మడి విశాఖ జిల్లా కొయ్యూరు మండలానికి సమీపంలోని వైన్ పాకాల గ్రామానికి చెందినవారు. బాధితురాలు (25) కూడా అదే గ్రామ నివాసి. ఆమె గిరిజన యువతి, అవివాహిత. నిందితుడు గిరీష్, కొండలమ్మ మధ్య పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ప్రేమతో ఇద్దరు శారీరకంగా దగ్గరయ్యారు. 2021 ఆగస్టు 14వ తేదీ నుంచి పలుమార్లు బాధితురాలుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గర్భవతిని చేశాడు. బాధితురాలికి ఒక కొడుకు పుట్టి చనిపోయాడు. అప్పటికే నిందితుడు గిరీష్ ఇద్దరు పిల్లల తండ్రి. తనను వివాహం చేసుకోవాలని పలుమార్లు ఆ యువతి ఒత్తిడి చేసినా ప్రయోజనం లేకపోయింది. గిరీష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు యువతిని పలుమార్లు శారీరకంగా హింసించారు. యువతి ఫిర్యాదు మేరకు కొయ్యూరు పోలీసులు నిందితులపై భారతీయ నేర సంహిత సెక్షన్ 417, 376 ,323, 506,509,279 కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు గిరీష్‌కి పది ఏళ్ల జైలు,ఇతర నిందితులకు వివిధ సెక్షన్ల కింద జరిమానా విధించారు.

వైభవంగా శ్రీజగన్నాథ స్వామి ప్రాణప్రతిష్ట



కొండపడలో బలభద్ర,సుభద్ర సమేత జగన్నాథ స్వామి విగ్రహాలు

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కొండపడలో 12 ఏళ్లకు ఒకసారి జరిగే శ్రీజగన్నాథ స్వామి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీజగన్నాథ స్వామి ఆలయంలో అప్పటి వరకు పూజించిన విగ్రహాలను మార్చి, ఒడిశా రాష్ట్రం పూరి నుంచి తెచ్చిన నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. మేళతాళాలు,సంకీర్తనలతో ఘనంగా ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 5 వేల మందికి అన్న ప్రసాదం అందజేశారు.



ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మరికొంత కాలం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. సికింద్రాబాద్–అగర్తలా(07030) వీక్లీ స్పెషల్ ప్రతీ సోమవారాలలో సాయంత్రం 4.35 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 4.40 గంటలకు బయల్దేరి ప్రతీ గురువారాల్లో తెల్లవారు 3 గంటలకు అగర్తలా చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో అగర్తలా– సికింద్రాబాద్(07029) వీక్లీ స్పెషల్ ప్రతీ శుక్రవారం ఉదయం 6.20 గంటలకు అగర్తలాలో బయల్దేరి ఆదివారం తెల్లవారు 3.05 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.25గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–సంత్రగచ్చి(07221) బై వీక్లీ స్పెషల్ ప్రతీ మంగళ, శనివారాల్లో ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు ఉదయం 10.52 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఈనెల 2 నుంచి సెప్టెంబరు 28వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో సంత్రగచ్చి–సికింద్రాబాద్(07222) స్పెషల్ ప్రతీ బుధ, ఆదివారాలలో మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.20 గంటలకు దువ్వాడకు, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఈనెల 3వ తేదీ నుంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు నడుస్తుంది.

ఐఐఎం వైజాగ్‌లో వుమెన్స్ పవర్

- 2024–26 ప్రోగ్రామ్‌లో మహిళలకు 40 శాతం సీట్లు
- 10వ బ్యాచ్‌లో 338 సీట్లకు 135 మహిళలకే..
- ఐఐఎంవీ పదేళ్ల చరిత్రలో ఇదే ప్రప్రథమం
- ఐఐఎంలలో జాతీయ సగటు మహిళా ప్రవేశాలు 25 నుంచి 30 శాతం మాత్రమే



ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్

సాక్షి, విశాఖపట్నం : మహిళలను ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్–విశాఖపట్నం (ఐఐఎంవీ) విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తోంది. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోషిప్ పొందిన తొమ్మిదో ఐఐఎంగా చరిత్ర పుటల్లోకెక్కిన నేపథ్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా వుమెన్ స్టార్టప్ హబ్‌ని ప్రారంభించిన ఐఐఎంవీ.. ఇప్పుడు సీట్ల కేటాయింపులోనూ అంతే ప్రాధాన్యమిచ్చింది. లింగ సమానత్వాన్ని పాటిస్తూ విశాఖ క్యాంపస్ చరిత్రలోనే తొలిసారిగా 40 శాతం సీట్లను మహిళలకు కేటాయించింది.

విద్య, వ్యాపారం, వాణిజ్య రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న ఐఐఎం విశాఖపట్నం బ్రాంచి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక స్టార్టప్ హబ్‌లను ఏర్పాటు చేసి సుశిక్షితుల్ని చేస్తోంది. రెండేళ్ల సుదీర్ఘ ఫెలోషిప్‌తో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ అందిస్తూ మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దుతోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐఎంవీ ఫౌండేషన్ ఫర్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూరియల్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఐఎంవీ ఫీల్డ్)ని రెండేళ్ల క్రితం ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 100 మందికి పైగా మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లు ఇక్కడ పురుడుపోసుకున్నాయి. తాజాగా 36 మంది మహిళా పారిశ్రామికవేత్తలతో మరో వుమెన్ స్టార్టప్ ప్రోగ్రామ్ నడుస్తోంది. అదే స్ఫూర్తితో విద్యా బోధనలోనూ ప్రత్యేకతను కనబరుస్తోంది.

పదేళ్ల ఐఐఎంవీ చరిత్రలో తొలిసారిగా..

లింగసమానత్వంలో ఇతర ఐఐఎంలకు ఆదర్శంగా నిలుస్తోంది విశాఖ బ్రాంచి. 2024 – 26 రెసిడెన్షియల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో దాదాపు 40 శాతం మంది విద్యార్థులు మహిళలే కావడం విశేషం. ఇన్‌స్టిట్యూట్ చరిత్రలో పదేళ్ల కాలంలో ఈ తరహాలో సీట్లు కేటాయించడం ఇదే ప్రప్రథమం. ఈ బ్యాచ్‌లో చేరిన 338 మంది విద్యార్థుల్లో 135 మంది మహిళలకు ప్రాధాన్యమిచ్చారు. వీరిలో గరిష్టంగా మహారాష్ట్రకు చెందిన విద్యార్థులు 25 శాతం మంది ఉండగా.. ఏపీకి చెందిన వారు 7 శాతం, ఢిల్లీ 6, కర్ణాటక 6, మధ్యప్రదేశ్ నుంచి 6 శాతం మంది మహిళలు సీట్లు పొందారు. మొత్తం బ్యాచ్‌లో కామర్స్ గ్రాడ్యుయేట్స్ 13 శాతం , సైన్స్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్స్ 11 శాతం మంది ఉన్నారు.

దేశ వ్యాప్తంగా ఐఐఎంల సగటు 30 శాతమే

దేశంలోని ఏ ప్రధాన ఐఐఎంలకు సాధ్యం కాని లింగసమానత్వాన్ని ఐఐఎంవీ సొంతం చేసుకుంది. సాధారణంగా ఐఐఎంలలో మహిళలకు సీట్ల కేటాయింపుల్లో జాతీయ సగటు 25 నుంచి 30 శాతం వరకూ మాత్రమే ఉంది. ఐఐఎంలలో చాలా కాలంగా తక్కువగా మహిళలకు సీట్లు కేటాయిస్తున్నారు. ప్రధాన ఐఐఎంలలోనూ 30 శాతం సీట్లు దాటడం లేదు. రెండు దశాబ్దాల కిందట దేశంలోని మొత్తం ఐఐఎంల్లో కలిపి మహిళలకు కేటాయించిన సీట్లు కేవలం 13 శాతం మాత్రమే. కానీ క్రమంగా వ్యాపార, వాణిజ్య రంగాల్లో మహిళల పాత్ర పెరుగుతుండటంతో సీట్ల కేటాయింపులోనూ ఐఐఎంలు వైవిధ్యం చూపాయి. ఐఐఎం, రాయపూర్, ఐఐఎం కోజికోడ్, ఐఐఎం రోహ్‌తక్‌లలో గత మూడేళ్లుగా 50 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తూ వస్తున్నారు. అదే బాటలో ఐఐఎం వైజాగ్ ఈ ఏడాది అడుగులు వేయడం శుభపరిణామంగా చెప్పుకోవచ్చు.

మలేరియా నివారణకు విస్తృత చర్యలు

జిల్లా మలేరియా అధికారి ప్రసాదరావు



గొట్లిపాడులో పిచికారీ పనులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ప్రసాదరావు

అనంతగిరి: మలేరియా నివారణకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా చర్యలు చేపట్టినట్టు జిల్లా మలేరియా అధికారి పి.వి.ఎస్. ప్రసాదరావు తెలిపారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ గొట్లిపాడులో రెండో విడత దోమల నివారణ మందు పిచికారీ పనులు ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో గిరిజనులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ హైరిస్క్ గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించినట్టు చెప్పారు. ఇప్పటికే దోమల నివారణ మందు మొదటి విడత పిచికారీ పూర్తిచేసి, రెండో విడత పిచికారీ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. మలేరియా కేసులు నమోదవుతున్న గ్రామాల్లో వైద్య, పంచాయతీ సిబ్బంది సహకారంతో ఫాగింగ్ ద్వారా దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. చిప్పపల్లిలో మలేరియా సోకిన మహిళ ఆరోగ్యపరిస్థితిని పరిశీలించారు. అనంతరం భీమవరం పీహెచ్‌సీని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అనూప్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైదరాబాద్ సీబీఐ జేడీ వీరేష్ ప్రభు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వీరేష్‌ప్రభు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని హైదరాబాద్ సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేష్ ప్రభు సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

క్లుప్తంగా

వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా

కొయ్యూరు: చోడవరం తొమ్మిదోవ జిల్లా అదనపు కోర్టు వేములపూడి ఉషాకిరణ్ అనే వ్యక్తి పెట్టుకున్న శిక్ష రద్దు పిటీషన్‌ను కొట్టివేసిందని ఎస్‌ఐ రామకృష్ణ సోమవారం సాయంత్రం తెలిపారు. కాకరపాడుకు చెందిన ఉషాకిరణ్ 2012లో ఒక ఆలయంలో చోరికి పాల్పడినట్టుగా కొయ్యూరు స్టేషన్‌లో కేసు నమోదైనట్టు చెప్పారు. ఇది నిర్ధారణ కావడంతో 2015లో చింతపల్లి ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ మూడు సంవత్సరాల జైలు శిక్ష,రూ. ఐదువేల జరిమానా విధించారని చెప్పారు. చోడవరం కోర్టుకు వెళ్లిన తరువాత ఆయన బెయిల్‌పై ఉన్నట్టు పేర్కొన్నారు. ఉషా కిరణ్ దానిని రద్దు చేయాలని పెట్టుకున్న ఆపీల్‌ను కోర్టు కొట్టి వేసిందన్నారు.దీంతో అతనిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

గడప వద్దకు పింఛన్ పంపిణీ చేయాలి



కొట్నాపల్లిలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా గడప వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ చెప్పారు. పింఛను పంపిణి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కొట్నాపల్లిలో ఆయన పర్యటించి వృద్ధులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో వృద్ధులకు ఇబ్బందులు లేకుండా గడప వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయాలన్నారు. ఎంపీడీపీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణపై ప్రత్యేక నిఘా

ఆరిలోవ: గంజాయి రవాణా, వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. సోమవారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలో క్రైం రేటు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి రవాణాను అడ్డుకునేందుకు డైనమిక్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీతో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. పోక్సో కేసులో ప్రమేయం ఉన్నవారిపై రౌడీ షీటు తెరిచే విధంగా తగిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి సంక్షేమం పూర్తిగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-2 ఎం.సత్తిబాబు, డీసీపీ క్రైం పి.వెంకటరత్నం, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వేంపాడు కుర్రాడు... పరిశోధనల్లో మెరిశాడు..

- ఎలక్ట్రానిక్స్‌లో ప్రతిభ చూపుతున్న ఆనంద్
- గ్రామీణ ప్రాంతం నుంచి సౌత్‌కొరియాలో పరిశోధనల స్థాయికి
- హైబ్రీడ్ ఎనర్జీ హార్వెస్టర్ రూపకల్పనలో విశేష కృషి



సౌత్‌కొరియాలోని కియాంగ్‌హీ యూనివర్సిటీలో తన ప్రొఫెసర్ జేసూయుతో ఆనంద్

నక్కపల్లి : పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదు. ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాదని, పరిశోధనల్లో ప్రతిభకు అసలే అడ్డు కాదని నిరూపించాడు గ్రామీణ యువకుడు. సాధారణపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ప్రతిభ కనరపరిచి విదేశాల్లో ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశోధనలు (పీహెచ్‌డీ) చేసే స్థాయికి ఎదిగాడు కూరాకుల ఆనంద్. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడుకు చెందిన కూరాకుల చిరంజీవి టైలరింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇతని కుమారుడు కూరాకుల ఆనంద్ పదో తరగతి వరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్, డిగ్రీలు పాయకరావుపేట శ్రీప్రకాష్ కళాశాలలో చదివాడు. ఎంఎస్సి టెక్ (ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్‌లో) స్పెషలైజేషన్ చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (వరంగల్)లో సీటు సంపాదించాడు. అక్కడ పీజీ పూర్తి చేసుకుని ఎలక్ట్రానిక్స్ రంగంలో మరింత పురోగతి సాధించే దిశగా ఆలోచనలు చేశాడు. ఇతని ఆలోచనలు, ప్రతిభకు, పరిశోధనలకుగాను సౌత్ కొరియాలో కీయాంగ్‌హీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభించింది. ఏడాది నుంచి అదే యూనివర్సిటీలో ఉంటూ హైబ్రీడ్ ఎనర్జీ హార్వెస్టర్, ఇంటిగ్రేటెడ్ ఎనర్జి స్టోరేజ్ సర్క్యూట్/ డిటెక్షన్ సిస్టం వంటి ప్రాజెక్టులపై తన ప్రతిభ కనపరుస్తున్నాడు. కియాంగ్‌హీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జేసూ యూ నేతత్వంలో పరిశోధనల్లో భాగంగా సౌకర్యవంతమైన పిజిఏ (పాలిగ్లూకోసమైన్) మిశ్రమాన్ని అభివృద్ధి చేసి ఫిల్మ్/పిడిఎంఎస్(పాలిడిమెథైల్‌సిలోక్సేన్) ఆధారిత హైబ్రీడ్ ఎనర్జి హార్వెస్టర్‌ను రూపొందించాడు. ఇది సింథసైజ్డ్ అల్యూమినియం, టైటనేట్ సూక్ష్మ కణాలతో నిర్మితమై అధిక పనితీరు అందిస్తుందని ఆనంద్ చెబుతున్నాడు. అదనంగా పాలిమర్ మిశ్రమ ఫిల్మ్ పరికరాన్ని కూడా రూపొందించినట్టు ఆనంద్ తెలిపాడు. తమ పరిశోధన ఫలితాలు ప్రముఖ అకడమిక్ జర్నల్ అడ్వాన్స్‌డ్ ఫంక్షనల్ మెటీరియల్స్‌లో కూడా ప్రచురించబడ్డాయన్నాడు. ఆనంద్ చేస్తున్న ఈ హార్వెస్టింగ్ టెక్నాలజీ పరిశోధన రంగంలో మైలురాయిగా నిలుస్తోంది. ఆనంద్ చేస్తున్న పరిశోధనలు వేంపాడు గ్రామానికి గర్వకారణం కాబోతున్నాయి. ప్రపంచ పటంలో వేంపాడుకు గుర్తింపు తీసుకు రాబోతున్నాయి. ఈ సందర్భంగా ఆనంద్ తండ్రి చిరంజీవి మాట్లాడుతూ ఆనంద్‌కు చిన్నప్పటి నుంచి పరిశోధనలు చేయాలనే ఆలోచన ఉండేదన్నారు. టైలరింగ్ ద్వారా తనకు వచ్చిన కొద్ది సంపాదనతోనే ఆనంద్‌ను డిగ్రీ వరకు చదివించానని తన కష్టానికి, ఆనంద్ ప్రతిభ తోడయిందన్నాడు. ప్రతి తరగతిలోను మెరిట్ స్టూడెంట్‌గా నిలవడం వల్లే నేడు ఎలక్ట్రానిక్స్‌రంగంలో పరిశోధనలకు గాను సౌత్‌కొరియా వెళ్లడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందే పరిశోధనలతో మైలురాయిని చేరుకుని తిరిగొస్తాడనే నమ్మకం ఉందన్నారు.

జీపు బోల్తా.. 15 మందికి గాయాలు

- బంగారు మెట్ట వద్ద ఘటన
- ఇద్దరి పరిస్థితి విషమం



పెదబయలు పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందుతున్న చిలకమ్మ

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ సమీపంలో సోమవారం మధ్యాహ్నం పెదబయలు వారపు సంతకు ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ జీపు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో 15 మంది గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి విషయమంగా ఉంది. సంఘటనకు సంబంధించిన వివరాలు. పెదబయలు మండలం కొరవంగి పంచాయతీ కేంద్రం నుంచి 15 మంది ప్రయాణికులతో పెదబయలు వారపు సంతకు జీపు బయలుదేరింది. ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ కేంద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి, అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ప్రయాణికులంతా చెల్లాచెదురుగా పడిపోయారు. చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. స్థానిక వైద్యాధికారి నిఖిల్ వైద్య సేవలు అందించారు. క్షతగాత్రులలో కొరవంగి గ్రామానికి చెందిన అప్పలమ్మ, చిలకమ్మలకు నడుము భాగంలో తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. జీపు బోల్తా పడ్డ ప్రదేశంలో పిచ్చి మొక్కలు అధికంగా ఉండడంతో జీపు లోయలోకి వెళ్లకుండా అడ్డుకున్నాయని, లేకుంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని స్వల్పగాయాలతో బయట పడ్డ ప్రయాణికులు తెలిపారు.

254 కిలోల గంజాయి స్వాధీనం

విలువ రూ.12.75 లక్షలు, ఒకరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి, ముద్దాయితో పోలీసులు

చింతపల్లి రూరల్: మండలంలోని అంజలిశనివారం పంచాయతీ కొత్తమాడెంబంధ గ్రామ శివారులో కొండ వద్ద మైదాన ప్రాంతాలకు తరలించేందుకు పొదల్లో దాచి ఉంచిన 254 కిలోల గంజాయిని సోమవారంస్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు స్థానిక సీఐ రమేష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు. ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకువచ్చి మైదాన ప్రాంతాలకు తరలించేందుకు కొండ వద్ద దాచి పెట్టారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో గంజాయిని పట్టుకున్నారు. గంజాయి రవాణాకు సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.12.75 లక్షలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అరుణ్ కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిట్టిబాబు

జి.మాడుగుల: మండలంలో బొయితిలిలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురల ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర పౌర సరఫరాల వినియోగదారుల వ్యవహారాల శాఖ ఉత్తర్వులు మేరకు 2024-25 విద్యా సంవత్సరం వినియోగదారుని విద్యపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారుని విద్యాపై అవగాహన, చట్టాలు, హక్కులు పరిరక్షణ కోసం ఆయన వివరించారు. ఆశ్రమ పాఠశాలలో 8,9తరగతుల విద్యార్థులకు క్లబ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హెచ్‌ఎం అప్పలకొండ, క్లబ్ ఇన్‌చార్జి చంటిబాబు, ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయుడు, జాయింట్ సెక్రటరీ బాలరాజు, మండల వినియోగదారుల సంఘం ప్రతినిధులు మాలంనాయుడు, శ్రీను, చిన్నారావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి మృతిపై వాస్తవాలు తేలాలి

- కేసును నీరుగారుస్తున్న తెనాలి పోలీసులు
- అనుమానితుల పేర్లు చెప్పినా విచారణ చెయ్యలేదు
- డిప్యూటీ సీఎం, హోం మంత్రికి లేఖ రాసిన మృతుడి తల్లిదండ్రులు

దాబాగార్డెన్స్(విశాఖ): తమ కుమారుడి అనుమానాస్పద మృతిపై పోలీసులు సరిగ్గా స్పందించడం లేదని, మృతి చెంది దాదాపు ఆరు నెలలు కావస్తున్నా పోస్టుమార్టం రిపోర్టుతో పాటు సెల్‌ఫోన్ కూడా ఇవ్వకుండా కేసును నీరుగారుస్తున్నారని గుంటూరు జిల్లా కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన బేతాళ విద్యావతి, బేతాళ రవిచంద్ర ×సాక్షి× వద్ద వాపోయారు. మా అబ్బాయి మృతిపై నిజనిజాలు తేలాలని, అనుమానితుల పేర్లు చెప్పినా విచారణ చేపట్టకపోవడంపై తమకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ కుమారుడు ఆదిత్య తెనాలిలో ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలలో చదువుతూ జనవరి 7వ తేదీ అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయాడని, 10వ తేదీన చెరువు వద్ద మృతదేహం లభ్యమైందని, మా అబ్బాయి సెల్‌ఫోన్ కూడా తీసుకున్నారని, ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెముడుబాడు గ్రామానికి చెందిన గ్లో బాబీతో చివరి సారిగా ఫోన్‌లో మాట్లాడినట్టు ఉందని, అనుమానితుల పేర్లు చెప్పినా పోలీసులు దర్యాప్తు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తెనాలి సీఐ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోగా, మీరు చెప్పిన వారందర్నీ పిలిపించి అడగాలా? అని ప్రశ్నించారని తెలిపారు. సహచరి విద్యార్థినితో మా అబ్బాయికి పరిచయం ఏర్పడిందని, ఆ విషయంలో కస్తూరి సాయి అనే వ్యక్తి వార్నింగ్ ఇచ్చినట్టు విద్యార్థుల ద్వారా తెలుసుకున్నామన్నారు. ప్రస్తుతం తన కుటుంబం విశాఖలోనే నివాసముంటుందని, తనకు న్యాయం చేయాలని, నా కుమారుని మృతిపై నిజనిజాలు తేల్చాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితకు లేఖ పంపినట్టు తెలిపారు.

కిడ్నీలు ఏర్పాటు చేస్తానంటూ మోసం

- పది లక్షలు ఇచ్చానని బాధితుడి ఫిర్యాదు

సీతమ్మధార(విశాఖ) : కిడ్నీలు ఏర్పాటు చేస్తానని చెప్పి రూ.పది లక్షలు కాజేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మురళీనగర్‌కు చెందిన శారద లక్ష్మి (37) అనారోగ్యంతో బాధపడుతోంది. ఇటీవల భర్త సత్యనారాయణ గోపితో కలిసి సీతమ్మధారలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టును సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యురాలు కిడ్నీ మార్పిడి చేయాలని చెప్పడంతో దిగులు చెందారు. ఈ క్రమంలో ఆస్పత్రి కో-ఆర్డినేటర్ అనిల్‌ను కలిశారు. రూ.27 లక్షలు ఇస్తే కిడ్నీలు ఏర్పాటు చేస్తానని బాధిత కుటుంబానికి చెప్పాడు. ఆయన మాటలు నమ్మి ఈ ఏడాది ఫిబ్రవరిలో అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు ఇచ్చారు. అప్పటి నుంచి ఫోన్ చేసినా స్పందించ లేదు. ఓ వైపు తన భార్య ఆరోగ్యం క్షీణిస్తుండడంతో జీవన్‌ధాన్‌ను సంప్రదించగా..వారి సాయంతో మరో ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. ఇదిలావుండగా తన వద్ద తీసుకున్న నగదు ఇవ్వాలని అనిల్‌ను నిలదీశాడు. ఆస్పత్రికి పదేపదే వస్తే ఊరుకునేది లేదని అనిల్ బెదరింపులకు పాల్పడ్డాడు. దీంతో మోసపోయానని గుర్తించి సత్యనారాయణ ద్వారకాపోలీసులను ఆశ్రయించాడు. కేసును పోలీసులు విచారిస్తున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణే

తొలి ప్రాధాన్యం

- ఒడిశా నుంచి విశాఖ మీదుగా గంజాయి తరలింపు
- ఈ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రణాళిక సిద్ధం
- విశాఖలో నాకు స్వీట్ మెమొరీస్ ఉన్నాయి
- పోలీస్ అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదు
- ఫిర్యాదులు, సమాచారం వెల్లడి కోసం ప్రత్యేక నెంబర్‌కు కాల్ చేయవచ్చు
- విశాఖ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శంఖబ్రత బాగ్చి



విశాఖ సిటీ : విశాఖలో మాదక ద్రవ్యాల నియంత్రణే తన తొలి ప్రాధాన్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. విశాఖ నూతన సీపీగా ఆయన సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం రోజున బాధ్యతలు తీసుకోవడం ఒక వైద్యుడిగా సంతోషంగా ఉందని తెలిపారు. విశాఖలో పరిస్థితులపై తనకు పూర్తి అవగాహన ఉందని వివరించారు. విధులరీత్యా పలు మార్లు విశాఖకు వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. నగరంలో విధులు నిర్వర్తించే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నా హనీమూన్ విశాఖలోనే..

విశాఖతో తనకు మంచి అనుబంధం ఉందని వెల్లడించారు. 2001లో జమ్మలమడుగు ఏఎస్పీగా ఉన్న సమయంలో వివాహం జరిగిందని తెలిపారు. ఆ తరువాత హనీమూన్‌కు ఎక్కడికి వెళ్లాలన్న ఫ్రెండ్స్‌తో సంభాషణలో అందరూ సిట్జర్లాండ్‌కు వెళ్లమని సూచించారన్నారు. కొంత మంది హిల్‌స్టేషన్, సీ షోర్ ఉండేలా చూసుకోవాలని సూచించడంతో తన భార్యకు సర్‌ప్రైజింగ్‌గా విశాఖకు తీసుకువచ్చానని చెప్పారు. దేశంలో రెండే ఒకే చోట ఉన్న ప్రాంతం విశాఖ మాత్రమే అని తెలిపారు.

గత మూడేళ్లలో గంజాయి సాగును ధ్వంసం చేశాం..

విశాఖ మహా నగరంలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం ప్రథమ సమస్య అని, వాటిని రూపుమాపడమే తన మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. గంజాయి ఒడిశా రాష్ట్రంలో అయిదు ప్రాంతాల నుంచి విశాఖ కేంద్రంగా రవాణా జరుగుతోందన్నారు. ఈ అక్రమ రవాణా అడ్డుకట్టవేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఉమ్మడి విశాఖలో అల్లూరి జిల్లాలో గంజాయి పంట సాగు బాగా తగ్గిపోయిందని తెలిపారు. గత మూడేళ్లలో శాటిలైట్ ఇమేజెస్, మానవ పరిజ్ఞానం ద్వారా గంజాయి సాగును గుర్తించి పెద్ద స్థాయిలో ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి అక్కడి రైతులకు ప్రత్యామ్నాయ పంటపై అవగాహన కల్పించామన్నారు.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు

పోలీస్ శాఖలో ఉన్న ప్రతి ఒక్కరూ రెండు విషయాలను గుర్తు పెట్టుకోవాలన్నారు. పోలీసులు ప్రజా సేవ చేయడానికే ఉన్నారని, ఎవరైనా సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తే కూర్చోబెట్టి మర్యాద ఇవ్వాలని సూచించారు. సామాన్యులు ఏదైనా చెప్పదలచుకుంటే వారి మాటలు శ్రద్ధగా వినాలని, ఎవరి పట్లా తప్పుగా ప్రవర్తించకూడదని స్పష్టం చేశారు. అలాగే పోలీస్ అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. పగలు, రాత్రుళ్లు పనిచేసే సిబ్బందికి అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

అందరి సహకారం అవసరం

నగరంలో ఇతర సమస్యలపై తనకు అవగాహన ఉందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు పెద్ద సంఖ్యలో సిబ్బంది వినియోగించాల్సి ఉంటుందని, అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి అందరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. నగరంలో అన్ని చోట్లా, అన్ని ఫీల్డ్‌లు, అన్ని సెక్టార్లలో పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

సమస్యలు ఉంటే ఫోన్ చేయండి..

నగర ప్రజలు తమ ఇబ్బందులు, ఫిర్యాదులు, సమాచారం ఇవ్వాలనుకుంటే నేరుగా 7995095799కు ఫోన్ చేసి తనకు చెప్పవచ్చన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. ఆ సమయంలో మీటింగ్‌లో ఉంటే అది పూర్తయిన తరువాత తిరిగి కాల్ చేస్తానని చెప్పారు. ఎస్ఎంఎస్, వాట్సాప్, వీడియో, ఆడియో, వాయిస్ మెసేజ్ పెట్టవచ్చని సూచించారు. ప్రజల మాత్రమే కాకుండా హోంగార్డ్స్ స్థాయి నుంచి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పోలీస్ శాఖ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులైనా సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఈ నెంబర్ తన వద్దే ఉంటుందని, ఫిర్యాదు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తేల్చి చెప్పారు. ఎటువంటి సందేహం లేకుండా నిర్భయంగా, ధైర్యంగా ముందుకు వచ్చి ఆ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పటిష్టమైన దేశ నిర్మాణం జీఎస్టీతో సాధ్యం



భారత క్రికెటర్ భరత్‌ను సత్కరిస్తున్న జీఎస్టీ కమిషనర్ శ్రీధర్, గోయాల్

మద్దిలపాలెం(విశాఖ) : పటిష్టమైన దేశ నిర్మాణం జీఎస్టీతోనే సాధ్యమవుతుందని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య డీఆర్‌డీ సూర్యప్రకాశరావు అన్నారు. సెంట్రల్ జీఎస్టీ విశాఖ జోన్ వస్తువు సేవా పన్ను 7వ వార్షికోత్సవాన్ని సోమవారం సెంట్రల్ జీఎస్టీ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యప్రకాశరావు, భారత్ క్రికెటర్ కేఎస్ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్‌ను జీఎస్టీ ప్రిన్సిపాల్ కమిషనర్ ఎన్.శ్రీధర్, ఆడిట్ కమిషనర్ రిషి గోయల్ సత్కరించారు. అనంతరం జరిగిన సభలో సూర్యప్రకాశరావు మాట్లాడుతూ జీఎస్టీ సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. జీఎస్టీ ఆదాయాన్ని భారీగా సేకరించడంలో అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం క్రికెటర్ భరత్ మాట్లాడుతూ పిల్లల అభిరుచి తెలుసుకోవాలన్నారు. క్రికెట్‌పై మక్కువ ఉంటే వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం జీఎస్టీ ప్రిన్సిపాల్ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర మొత్తం మీద విశాఖ జోన్ రూ.24,851 కోట్లు జీఎస్టీ రూపేణా వసూలు చేసిందన్నారు. న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ మూల్యాంకనం చేసిన 11 పారామీటర్‌లలో దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందన్నారు. అనంతరం పెద్ద, చిన్న తరహా విభాగాల్లో పన్ను చెల్లింపుదారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. డిపార్ట్‌మెంట్‌కు చెందిన 8 మంది ఉద్యోగులను అవార్డులతో సత్కరించారు.

ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను రక్షించిన పోలీసులు



బాధిత మహిళ, పిల్లలతో ఎస్.ఐ ఎ.సత్యారావు

అల్లిపురం(విశాఖ): కుటుంబ సమస్యల కారణంగా ఓ వివాహిత, తన ఇద్దరి పిల్లలతో ఆర్కేబీచ్‌లో ఆత్మహత్యకు పాల్పడుతుండగా మహారాణిపేట పోలీసులు రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో బీచ్‌లోకి వెళ్తుండగా పి.గౌరీశ్వరరావు అనే వ్యక్తి వారిని గమనించి అనుమానంతో డయల్ 112కి ఫోన్ చేసి సమాచారం అందజేశాడు. దీంతో కంట్రోల్ రూమ్ సిబ్బంది మహారాణిపేట పరిధిలో నైట్‌డ్యూటీలోని టూటౌన్ సీఐ బి.తిరుమలరావు, క్రైం ఎస్.ఐ ఎ.సత్యారావు సమాచారం అందజేయడంతో ఆయన తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. బీచ్‌లో తన ఇద్దరి పిల్లలతో ఆత్మహత్యకు పాల్పడుతుండగా గుర్తించి ఆమెను రక్షించి, వివరాలు తెలుసుకున్నారు. తనది కంచరపాలెం అని, భర్త, తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నట్లు తెలిపింది. తన భర్త ప్రతిరోజు తాగివచ్చి తనను, తన తల్లిదండ్రులను తీవ్రంగా హింసిస్తున్నాడని, ఆదివారం రాత్రి కూడా తనను కొట్టడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపింది. బాధితు రాలిని, పిల్లలను ఆమె సోదరుడి పోలీసులు అప్పగించారు. సీఐ బి.తిరుమలరావు, ఎస్.సత్యారావు, కానిస్టేబుల్ నాగలక్ష్మిలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి అభినందించారు.

వారియర్స్, లయన్స్ సత్తా

- బెజవాడ టైగర్స్‌పై వైజాగ్ వారియర్స్ పంజా
- కోస్టల్‌రైడర్స్‌పై ఉత్తరాంధ్ర లయన్స్ విజయం



బ్యాటింగ్ చేస్తున్న సాయిరాహుల్



ఆట ముగిసిన తరువాత వెనుతిరుగుతున్న టైగర్స్ టీమ్ సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్-3లో భాగంగా సోమవారం రెండు మ్యాచ్‌లు రసవత్తరంగా జరిగాయి. తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై వైజాగ్ వారియర్స్ జట్టు, కోస్టల్‌రైడర్స్‌పై ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు విజయం సాధించాయి. వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి వైజాగ్ వారియర్స్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ ఆరు వికెట్లకు 143 పరుగుల చేసింది. అనంతరం 144 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన వైజాగ్ వారియర్స్ జట్టు మరో ఐదు బంతులుండగానే విజయకేతనం ఎగురవేసింది. వారియర్స్ కెప్టెన్ కె.ఎస్.భరత్ కేవలం 23 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్ 46 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో గేమ్ చేంజర్‌గా భరత్ అవార్డు అందుకోగా, సూపర్ స్ట్రయికర్‌గా సాయిరాహుల్, ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా సుదర్శన్ నిలిచారు.

రైడర్స్‌కు మరో పరాజయం

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన రెండో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ తొమ్మిది వికెట్ల తేడాతో కోస్టల్‌రైడర్స్‌పై విజయం సాధించింది. గత సీజన్ టైటిల్ పోరులో తలపడ్డ కోస్టల్ రైడర్స్... ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ 131పరుగులకే ఆలౌటైంది. ప్రతిగా ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు కేవలం ఒకే వికెట్ కోల్పోయి 8.3 ఓవర్లలోనే విజయం సాధించింది. ఓపెనర్, వికెట్ కీపర్ తరుణ్ (50) 24 బంతుల్లోనే ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో అర్ధసెంచరీతో చెలరేగగా...తపస్వి (52)23 బంతుల్లోనే ఏడు ఫోర్లు మూడు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు.